

సమయానికి చేరదేమి..! 8లో▸

హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, నిర్మల్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులు నిత్యం ఆలస్యంగా గమ్యాన్ని చేరుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పట్లేదు.



కొనసాగుతున్న 'సమగ్ర' సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: కలెక్టరేట్ ఎదుట 'సమగ్ర' ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 23వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె విరమించబోమని వారు పేర్కొన్నారు.



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి కాస్త పెరుగుతుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

తెగ తాగేశారు

- మూడురోజుల్లో రూ.5.05 కోట్ల విలువైన మద్యం విక్రయాలు
- గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.93.67 లక్షలు అధికం
- జోరుగా ఇయర్ ఎండింగ్ వేడుకలు



ఆసిఫాబాద్: ఈ ఏడాది ఇయర్ ఎండింగ్ వేడుకల్లో జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన సందర్భంగా డిసెంబర్ 31న మద్యం ఏరులై పారింది. మామూలు రోజులతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే రూ.93 లక్షలు అధికంగా మద్యం అమ్ముడు పోయింది. మద్యంతో పాటు మాంసం విక్రయాలూ అదే స్థాయిలో ఉన్నాయి. ఏటా ఇయర్ ఎండింగ్ వేడుకల్లో భాగంగా డిసెంబర్ 31న జిల్లాలో భారీగా మద్యం విక్రయాలు జరుగుతుండగా, ఈ సారీ అదే స్థాయిలో విక్రయాలు కొనసాగాయి. ప్రభుత్వం మద్యం దుకాణాలకు అర్ధరాత్రి 12 గంటల వరకు అనుమతిచ్చింది. డిసెంబర్ 31 ఉదయం నుంచి హోటళ్లు, బార్లు తెరుచుకోవడంతో యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు పార్టీలు చేసుకునేందుకు ఉత్సాహం కనబరిచారు. ఈ క్రమంలో జిల్లాలోని 32 మద్యం దుకాణాల్లో డిసెంబర్ చివరి మూడురోజుల్లో రూ.5కోట్ల 5లక్షల 71వేల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. గతేడాది రూ.4కోట్ల 12లక్షల 3వేల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.93.67లక్షల మద్యం అధికంగా అమ్ముడుపోయింది. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది డిసెంబర్ చివరి మూడురోజుల్లో జిల్లాలో 5,634 ఐఎంఎల్ లిక్కర్, 6,005 బీర్ల అమ్మకాలు జరిగాయి. ఇయర్ ఎండింగ్ సందర్భంగా మూడురోజులపాటు భారీగా మద్యం అమ్ముడుపోయింది.

భారీగా కేక్‌లు, స్వీట్ల అమ్మకాలు

జిల్లా వ్యాప్తంగా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్‌లు, స్వీట్ల విక్రయాలు భారీగా జరిగాయి. మామూలు రోజుల్లో స్థానికంగా తయారైన కేకులు విక్రయిస్తుండగా, న్యూ ఈయర్ వేడుకలను పురస్కరించుకుని మంచిర్యాల, కరీంనగర్‌కు చెందిన కొన్ని కంపెనీలు ప్రత్యేక కేక్‌లు తయారు చేసి మండలాలవారీగా రిటైల్ దుకాణాలకు సరఫరా చేశాయి. దీంతో జిల్లాలో భారీగా ప్రత్యేక కేక్‌ల దుకాణాలు వెలిశాయి. ప్రత్యేక టెంట్లు వేసి స్టాళ్లు ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు వివిధ రకాల ఆకరర్షణీయమైన కేకులు అందుబాటులో ఉంచి ఆఫర్లు ప్రకటించారు. న్యూ ఇయర్ కేక్ కిలో రూ.200కు విక్రయించగా, కూల్ కేక్ కిలో రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయించారు. ఒక్కో కేక్ కనీసం రూ.100 నుంచి రూ.500 వరకు, కిలో స్వీట్ రూ.400 నుంచి రూ.500 వరకు అమ్మకాలు జరిపారు. నలుగురు కలిస్తే చాలు.. కేక్ కట్ చేసి కొత్త సంవత్సర వేడుక చేసుకున్నారు. దీంతో జిల్లాలోని స్వీట్ హౌస్‌లు, బేకరీలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. భారీ అమ్మకాలతో ఒకేరోజు భారీగా లాభాలు గడించారు.

మాంసం విక్రయాలు కూడా..

ఇయర్ ఎండింగ్ వేడుకలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మద్యంతో పాటు మాంసం విక్రయాలు ఊపందుకున్నాయి. జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్ మున్సిపాలిటీతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో ఇయర్ ఎండింగ్ వేడుకలు జోరుగా సాగాయి. ఆటాపాటలతో జనం ఉత్సాహంగా వేడుక చేసుకున్నారు. హోట ళ్లు, బార్లతో పాటు ప్రత్యేక పర్యాటక ప్రాంతాల్లో సంబురాలు జరుపుకొన్నారు. భారీ స్థాయిలో చికెన్, మటన్, చేపల విక్రయాలు సాగాయి. ప్రధానంగా ఈ ఏడాది చివరిరో జు మంగళవారం రావడంతో అన్ని వర్గాల ప్రజలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నా రు. పర్యాటక ప్రాంతాలతో పాటు నివాస ప్రాంతాల్లో యువత, మహిళలూ వేడుకలు జరుపుకొన్నారు.

జిల్లాలో మద్యం విక్రయాలు ఇలా..

సంవత్సరం	ఐఎంఎల్ కేసులు	బీరు కేసులు	ఆదాయం (రూపాయల్లో..)
2022	4,690	4,115	4,15,78,834
2023	4,969	4,010	4,12,03,419
2024	5,634	6,005	5,05,71,010



ఆత్మగౌరవ పోరాటమే భీమా కోరేగావ్ యుద్ధం



శౌర్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: 1818 జనవరి 1న మహారాష్ట్రలోని కోరేగావ్ గ్రామం వద్ద మహర్లు, పీష్వా రాజుల మధ్య జరిగిన వీరోచిత యుద్ధం దళితుల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిందని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార, ఖమాన నాగసేన్ బుద్ధ విహార ఆవరణలో భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపాన్ని ప్రదర్శించి నివాళులర్పించారు. అనంతరం పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. పీష్వా రాజ్యంలో మహర్‌లు అంటరానితనంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్న కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీలో 500 మంది సైనికులుగా చేరి సుమారు 28వేల మంది పీష్వా సైన్యంతో వీరోచిత పోరాటం చేసి ఓడించారని తెలిపారు. మహర్‌ల వీరత్వాన్ని గుర్తించిన బ్రిటీష్ అధికారులు కోరేగావ్ గ్రామం వద్ద అమరవీరుల స్థూపం నిర్మించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు జైరాం ఉప్రె, నాయకులు విలాస్, రాజేంద్రప్రసాద్, గేడం హిరిషన్, దుర్గం సునీల్, హంసరాజ్, శ్యాంరావు, మహేశ్, రోషన్, అరుణ్, రమేశ్, ప్రతాప్, ఖమాన నాయకులు కిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఖోఖో సీఎం కప్ మహిళల విజేత ఆసిఫాబాద్



రాష్ట్ర విజేత ఆసిఫాబాద్ జట్టు

వరంగల్: సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో భాగంగా వరంగల్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన మహిళల విభాగంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మొదటి స్థానం, నల్లగొండ జిల్లా ద్వితీయ, హైదరాబాద్ జిల్లా తృతీయ, రంగారెడ్డి జిల్లా జట్టు నాలుగో స్థానాలను కై వసం చేసుకున్నట్లు డీవైఎస్వో సత్యవాణి తెలిపారు. అలాగే పురుషుల విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు మొదటి స్థానం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెండో స్థానం, ఆదిలాబాద్ జిల్లా మూడో స్థానం, నిర్మల్ జిల్లా జట్టు నాలుగో స్థానం పొందారని పేర్కొన్నారు. విజేతలను అధికారులు అభినందించారు.

ఎస్పీని కలిసిన ఎస్డీపీవో



ఎస్పీకి మొక్క ఇస్తున్న చిత్తరంజన్

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల బదిలీల్లో భాగంగా జిల్లాకు కేటాయించబడిన ఎస్డీపీవో ఎస్.చిత్తరంజన్ బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

30 పోలీస్ యాక్ట్ కొనసాగింపు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 1నుంచి 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేల వినియోగం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులని పేర్కొన్నారు.

బాలాజీ వెంకన్న సేవలో ఎస్పీ



ఎస్పీని సన్మానిస్తున్న ఈవో, అర్చకులు

రెబ్బెన: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని గంగాపూర్‌లోగల శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామిని బుధవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీకి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో బాపిరెడ్డి ఎస్పీని శాలువాతో సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నూతన సంవత్సరం రోజు స్వామివారిని దర్శించుకోవటం సంతోషంగా ఉందని తెలిపారు. ఎస్పీ వెంట రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: గత ఒప్పందం ప్రకారం సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల కూలి పెంపు జీవోను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి సుధాకర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి బుధవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ హమాలీలు నిరవధిక దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా క్వింటాల్‌కు రూ.26 నుంచి రూ.35కు పెంచాలని, 350 కిలోల బెల్స్ బండిల్ ఎగుమతి, దిగుమతికి రూ.200 పెంచాలని కోరారు. దసరా దుగ సందర్భంగా ఇచ్చే స్వీటుకు రూ.800 నుంచి రూ.1,200కు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, బోనస్ రూ.6,500 నుంచి రూ.10వేలకు పెంచాలన్నారు. రిటైర్డయిన వారికి పీఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా నియమించాలన్నారు. యూనిఫాం కుట్టు చార్జీ కింద రూ.2వేలు చెల్లించాలని, గోదాంలలో కార్మికులను నియమించుకునే అధికారం కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ ప్రజాపంపిణీ పథకాన్ని సంపూర్ణంగా రద్దు చేసి ఏటీఎం, ఏటీఆర్‌ను పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాస్, తుకారాం, మోహన్, కొమురక్క తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు దోపిడీ!



సోమవారం కౌటాలలో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న దళారులు

- మార్కెట్‌లో పత్తి ధరలో కోత
- నాణ్యత సాకుగా చూపి దగా
- సీసీఐ నిర్వాకంతోనే అక్రమాలు

బెజ్జూర్: ఆరుగాలం కష్టపడి పత్తి పండించిన రైతన్నలు దోపిడీకి గురవుతున్నారు. గిట్టుబాటు ధర లభించక అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు సీసీఐ అధికారులు కొనుగోళ్లలో దగా చేస్తుండటంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సి ఉండగా.. నాణ్యత తగ్గిందని, తేమ ఎక్కువుందని కొర్రీలు పెడుతుండటంతో నిండా మునుగుతున్నారు. దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నష్టాలు చవిచూస్తున్నారు. కాగా, మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చే పత్తిలో 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటే కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 తో కొనుగోలు చేస్తామన్న అధికారులు ఇప్పుడు మోసాలకు తెరలేపారు. ఇదివరకు తేమ శాతం సాకుతో ధర తగ్గి నష్టపోయిన రైతులకు.. ఇప్పుడు నాణ్యత ప్రమాణాల పేరిట ధరలో కోత విధించడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సీసీఐ నిర్వాకంతో మోసపోవాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు.



సిర్పూర్(టి) జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి వాహనాలు

అడుగడుగునా అవస్థలే..

జిల్లా రైతులు పత్తి విక్రయించేందుకు అడుగడుగునా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇదివరకు తేమ శాతంతో కొర్రీలు పెట్టగా, ప్రస్తుతం నాణ్యత ప్రమాణాలను సీసీఐ అధికారులు సాకుగా చూపుతూ రైతులను మోసం చేస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 335 గ్రామపంచాయతీలుండగా 10 జిన్నింగ్ మిల్లులున్నాయి. ప్రతీ గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా దళారులు రైతుల నుంచి పత్తిని అడ్డగోలుగా కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత మద్దతు ధరతో విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. కాగా, మార్కెట్‌లో తూకంలోనూ మోసాలకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. సాధారణం కంటే అధిక వర్షం కురిసింది. పత్తి చేన్లలో నీరు నిల్వ ఉండటం, బీటలు పడటంతో రైతులు మరోసారి విత్తనాలు విత్తుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆ తర్వాత సెప్టెంబర్, అక్టోబర్‌లో పూత, కాత దశలో ఉండగా వర్షాలు కురవకపోవడంతో దిగుబడిపై ప్రభావం పడింది. ఎకరాకు ఐదు క్వింటాళ్ల కంటే ఎక్కువ దిగుబడి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పంటలు పండించగా పెట్టిన పెట్టుబడులూ రాలేని దుస్థితి నెలకొందని దిగులు చెందుతున్నారు.

దళారుల దగా

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో నిత్యం ఎక్కడో ఓ చోట వారసంత నిర్వహిస్తున్నారు. దీంతో దళారులు అక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామాల్లోని రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.6,400 మాత్రమే చెల్లించి అడ్డగోలుగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. దళారుల దందాకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. మరోవైపు పంటను మార్కెట్‌లో విక్రయించేందుకు వెళ్లిన పలువురు రైతులకు తూకంలో మోసాలు, తేమ, నాణ్యత పేరిట అధికారులు కొర్రీలు పెడుతుండటంతో వారు అవస్థలు పడుతున్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో గిట్టుబాటు కాకపోయినా పంటను విక్రయించాల్సిన దుస్థితి నెలకొంటోందని రైతులు వాపోతున్నారు.

సీసీఐ మాయాజాలం!

పత్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండగా కొద్దిరోజులుగా నాణ్యత తగ్గిందనే సాకు చూపి క్వింటాల్‌కు రూ.50 నుంచి రూ.70 వరకు తగ్గిస్తుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. అలాగే 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉన్నవారి వద్దే కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు తేల్చి చెబుతుండటంతో రైతులు పత్తిని ఆరబెట్టుకుని మార్కెట్‌కు తెస్తున్నారు. అయినప్పటికీ నాణ్యత లేదనే సాకు చూపి కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారు. తేమ కొర్రీలు, నాణ్యత ప్రమాణాలు ఇలా సవాలక్ష సాకులు చూపుతుండటంతో మద్దతు ధర దక్కడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమీ చేయలేని స్థితిలో పత్తిని తక్కువ ధరకే దళారులకు విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

అడ్డగోలుగా దోచేస్తున్నారు



తేమ పేరిట అడ్డగోలుగా దోచేస్తున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. పత్తికి మద్దతు ధర ఇవ్వకుండా కోత పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అసలే పంట దిగుబడి తగ్గింది. పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి ఉంది.

– ఉమ్మెర సత్యనారాయణ, మర్తిడి

మద్దతు ధర ఇస్తలేరు



పత్తి పంటకు మద్దతు ధర చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. తేమ, నాణ్యత ప్రమాణాలను సాకుగా చూపుతూ తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది.

– నికూరి కిరణ్, చిన్నసిద్దాపూర్

ఘనంగా 'నూతన' వేడుకలు



జిల్లా కేంద్రంలోని సాయిమందిరంలో మధ్యాహ్న హారతికి హాజరైన భక్తులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రద్ధా శుక్లా



హన్మాన్ మందిర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా మిత్రులు, బంధువులకు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలో షిర్డీ సాయి మందిర్, శివకేశవ మందిర్, కేశవనాథ ఆలయం, బాలేశ్వర మందిరంతో పాటు కేస్లాపూర్ హనామన్ మందిర్‌లో భక్తుల రద్దీ కనిపించింది. సాయి మందిరంలో మధ్యాహ్న హారతికి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే కుటుంబ సమేతంగా జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి మందిరాన్ని దర్శించుకున్నారు. అర్చకులు ఇందారపు మధూకరశర్మ, సాయిశర్మ కలెక్టర్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారు ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు అధికారులు కలెక్టర్‌ను కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో చర్చీల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచే క్రైస్తవులు అధికసంఖ్యలో చర్చీలకు తరలివచ్చారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఇష్ట దేవతలకు స్వచ్ఛమైన పూజలు

- నేడు ఓంరాజ్ వంగెపురి భీమయ్యక్‌కు పూజలు
- రేపు రాజుల్ దేవునికి కూడా..
- హాజరుకానున్న కొలాం ఆదివాసీలు



గ్రామానికి చేరిన రాజుల్ దేవత

కెరమెరి: అడవితో పాటు సూర్యచంద్రులు, నీరు, నిప్పును పూజించే స్వభావం కొలాం ఆదివాసీలది. వీరు భీము దేవున్ని కొలుస్తారు. తమ సంస్కృతిని కాపాడుతున్న కొలాం ఆదివాసీలు నేడు, రేపు ఇష్ట దేవతలకు మొక్కు తీర్చుకోనున్నారు. మండలంలోని జోడేఘట్ పంచాయతీ పరిధి పాట్నాపూర్ గ్రామంలో కొలువైన ఓంరాజ్ వంగెపురి భీమయ్యక్ స్వామి, రాజుల్ దేవతలకు మూడురోజులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ గ్రామంలో కొలువై ఉన్న ఈ దేవతలను ఒక్కరోజు ముందే గ్రామంలోకి తీసుకువచ్చారు. సమీప గ్రామాలతోపాటు ఇంద్రవెల్లి ఉట్నూర్, ఆదిలాబాద్, కెరమెరి, వాంకిడి, దండేపల్లి, లింగాపూర్, సిర్పూర్(యు)(టి), ఇచ్చోడ మండలాల్లోని అనేక గ్రామాలతో పాటు మహారాష్ట్రకు చెందిన వందలాది భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కు తీర్చుకుంటారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

గురువారం నుంచి నుంచి ఈ నెల 4వ తేదీ వరకు ఇష్ట దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే కొత్త కోడళ్ల బేటింగ్ ఎంతో ఉత్సాహంగా సాగుతుంది. వంగెపురి భీమయ్యక్, రాజుల్ దేవతలకు సమష్టిగా పూజల చేస్తారు. అనంతరం పెద్దల ఆశీర్వాదం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు.

గతంలో మూడేళ్లకోసారి..



గతంలో మూడేళ్లకోసారి ఈ ఉత్సవాలను నిర్వహించే వాళ్లం. రెండేళ్ల క్రితం ఏటా నిర్వహించాలని నిర్ణయించాం. మూడేళ్లకోసారి అగ్నిగుండంలో నడిచే కార్యక్రమం ఉంటుంది.

– సిడాం భీంరావు, గ్రామ పెద్ద

కోరికలు తీర్చే దేవతలు



మూడ్రోజులపాటు పాట్నాపూర్ సమీపంలోని ఆలయంలో నిర్వహించే షష్టి పూజలకు కొలాం ఆదిమ గిరిజనులు వస్తారు. వంగెపురి భీమయ్యక్, రాజుల్ దేవతలు కోరికలు తీర్చుతారు.

– ఆత్రం భీంరావు, గ్రామస్తుడు

సమయానికి చేరదేమి..!

ఓ మండలానికి చెందిన దంపతులు నిర్మల్ బస్టాండ్‌లో సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కారు. బస్సు రాత్రి 10 గంటలకు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌కు చేరుకోవాల్సి ఉండగా, గంట 15 నిమిషాలు ఆలస్యంగా 11.15 గంటలకు చేరుకుంది. ఆ దంపతులే డిసెంబర్ 26వ తేదీన తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4.20 గంటలకు ఎంజీబీఎస్‌లో బస్సు ఎక్కారు. మార్గమధ్యలో బస్సును ఓ దాబా వద్ద దాదాపు 40 నిమిషాల పాటు ఆపారు. నిర్మల్‌కు రాత్రి 10 గంటలకు చేరుకోవాల్సిన బస్సు రాత్రి 11.30 గంటలకు చేరుకుంది. దీంతో సదరు దంపతులు సంవత్సరం వయస్సు ఉన్న వారి పాపతో చలిలో ఇబ్బందులు పడ్డారు.


తుప్రాన్ వద్ద గల ఓ దాబా ఎదుట ఆగిన బస్సు

హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల వివరాలు..

నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు (నిర్మల్ డిపో) : 29
ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు (ఆదిలాబాద్ డిపో) : 23

- హైదరాబాద్‌కు సకాలంలో చేరుకోని బస్సులు
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు రావడంలో సైతం ఆలస్యం
- గంటన్నర లేట్ అవుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

బోథ్: ఆర్టీసీ అంటేనే ప్రజల్లో ఓ నమ్మకం. ఆర్టీసీ బస్సులు సురక్షితం.. అనే భావన ప్రజల్లో ఉంది. డ్రైవర్లు, సిబ్బంది ప్రజలతో మమేకమవుతూ సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తున్నారు. కాగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన బస్సులు హైదరాబాద్‌కు చేరుకోవడానికి, హైదరాబాద్ నుంచి జిల్లాలకు రావడానికి చాలా ఆలస్యమవుతోంది. జిల్లాల్లో తిరిగే బస్సులు సమయానికి గమ్యస్థానాలు చేరుకుంటున్నా హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే ఆదిలాబాద్, నిర్మల్ డిపోలకు చెందిన బస్సులు మాత్రం సమయానికి చేరుకోవడం లేదు. బస్సులు గమ్యస్థానానికి చేరుకోవాల్సిన సమయం కన్నా ఏకంగా గంటన్నర ఆలస్యంగా చేరుకోవడంతో ప్రయాణికులు అసహనానికి గురవుతున్నారు. హైదరాబాద్‌లో పని నిమిత్తం వెళ్లే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో బస్సులు సమయానికి చేరుకోకపోవడంతో తమ గ్రామాలకు వెళ్లే చివరి బస్సులను అందుకోలేకపోతున్నామని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఆలస్యానికి పలు కారణాలు..

జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన బస్సులు, అక్కడి నుంచి రావాల్సిన బస్సులు ఆలస్యంగా రావడంలో అనేక కారణాలు ఉన్నాయి. బస్టాండ్‌లో బస్సు పాయింట్ వద్ద బస్సు సమయానికి ప్రారంభం కాకపోవడం.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల వల్ల ఆలస్యంగా వస్తున్నాయి. ఎంజీబీఎస్ నుంచి జేబీఎస్ వరకు రావాలంటే గంట సమయం పడుతోంది. దీనికితోడు సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్ వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మాణంలో ఉండటంతో ట్రాఫిక్ భారీగా ఉంటోంది. దీనివల్ల బస్సులు సమయానికి గమ్యస్థానాలు చేరుకోవడం లేదు.

దాబాల వద్ద..

మార్గమధ్యలో భోజనం చేయడానికి బస్సులను పలు దాబాలు, హోటళ్ల వద్ద దాదాపు 40 నిమిషాల పాటు ఆపుతున్నారు. దీనివల్ల కూడా ఆలస్యం జరుగుతోంది. ప్రయాణికులు మూత్రవిసర్జన కోసం, భోజనం కోసం ఆపాలని కోరుతున్నట్లు పలువురు డ్రైవర్లు పేర్కొంటున్నారు. అయితే బస్సులను మూత్రశాలలు సరిగా లేని, భోజనం నాణ్యతగా లేని హోటళ్లు, దాబాల వద్ద ఆపుతున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

రోడ్డు పనులతో ఆలస్యం..

రోడ్డు పనుల కారణంగా ఆదిలాబాద్, నిర్మల్‌ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి, అక్కడి నుంచి తిరుగు ప్రయాణానికి కొంత ఆలస్యం జరుగుతోంది. మేడ్చల్, కోంపల్లి, సుచిత్ర వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మాణంలో ఉన్నాయి. ట్రాఫిక్ వల్ల కూడా ఆలస్యమవుతోంది. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– ప్రవీణ్ కుమార్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం, ఆదిలాబాద్

క్లుప్తంగా

మతిస్థిమితం లేని వృద్ధురాలు మృతి

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్ గ్రామానికి చెందిన భూతి రాజుబాయి (75) అనే మతిస్థిమితం లేని వృద్ధురాలు పత్తి చేనులో మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాజుబాయి డిసెంబర్ 30న ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో డిసెంబర్ 31న పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో బుధవారం అదే గ్రామానికి చెందిన చాహకటి ఈశ్వర్ పత్తి చేనులో వృద్ధురాలు మృతి చెంది ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గొల్లపేట్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీకి చెందిన మహంకాలి శ్రీనివాస్(50) తన అన్నయ్య మహంకాలి అంజయ్యతో కలిసి పని మీద స్థానిక ఐబీ చౌరస్తాకు వెళ్లాడు. అక్కడ శ్రీనివాస్ కాలినడకన రోడ్డు దాటుతుండగా శ్రీరాంపూర్ వైపు నుంచి అతి వేగంగా వచ్చిన టాటా ట్రాలీ బలంగా ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య శ్యామల, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్యామల ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్ ఎండీ ఫిరోజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

నేడు నాగోబా జాతర నిర్వహణపై సమీక్ష

ఇంద్రవెల్లి: ఈ నెల 28న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభించనున్న నాగోబా జాతర నిర్వహణపై కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో గురువారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి ప్రకటనలో తెలిపారు. నాగోబా దర్బార్ హాల్‌లో సమావేశం మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, మెస్రం వంశీయులు హాజరు కావాలని ఆయన కోరారు.

దుబాయ్‌లో జిల్లావాసి వెతలు

- పక్షవాతంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జైరామ్
- స్వగ్రామానికి పంపే ఏర్పాట్లు చేస్తున్న మైగ్రేంట్స్ ఫోరం ప్రతినిధులు


దుబాయ్‌లో చికిత్స పొందుతున్న జైరామ్

నిర్మల్‌ఖిల్లా: పొట్ట చేతపట్టుకొని ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్తున్న జిల్లావాసులు వివిధ కారణాల రీత్యా అనారోగ్యం బారిన పడుతున్నారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ –జి మండలం గొల్లమాడ గ్రామానికి చెందిన కేసారం జైరామ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అతను పక్షవాతం బారినపడడంతో అక్కడి యాజమాన్యం ఆసుపత్రిలో చేర్పించింది. ప్రస్తుతం చికిత్స కొనసాగుతుండగా కుటుంబ సభ్యులకు అతని ఆచూకీ తెలియక గతకొన్ని రోజులుగా ఆందోళన చెందారు. అక్కడి మైగ్రేంట్స్ రైట్స్ వెల్ఫేర్ ఫోరం, దుబాయ్ శాఖ సమన్వయకర్త జంగం బాలకిషన్, ప్రతినిధి కోటపాటి నరసింహానాయుడుల చొరవతో బాధితుడి పూర్తి వివరాలను సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతున్న జైరామ్‌ను కుటుంబ సభ్యులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడించారు. ఆరోగ్యం మెరుగైన అనంతరం ఇండియాకు పంపేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు మైగ్రేట్స్ ఫోరం ప్రతినిధులు బుధవారం వెల్లడించారు.

అడవి కుక్కలదాడి.. 55 మేకలు మృతి


మేకల కళేబరాలు

కోటపల్లి: మేకల మందపై అడవి కుక్కలు దాడిచేయడంతో 55 మేకలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. నక్కలపల్లి గ్రామానికి చెందిన ముల్కల్ల వెంకటి మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న 140 మేకలను రోజులాగే బుధవారం గ్రామ శివారులోని ఆటవీ ప్రాంతంలోకి మేతకు తీసుకెళ్లాడు. ఒక్కసారిగా అడవికుక్కలు మేకల గుంపుపై దాడిచేయగా 55 మేకలు మృత్యువాత పడగా 22 మేకలు కనిపించకుండా పోయాయి. సుమారు రూ.6లక్షల విలువ గల జీవాలు మృతిచెందినట్లు బాధితుడు వాపోయాడు. అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని వేడుకున్నాడు.

చికిత్స పొందుతూ రైతు మృతి

తిర్యాణి: పురుగుల మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చింతపెల్లి పంచాయతీ పరిధి ఇర్కపెల్లి గ్రామానికి చెందిన కుడ్మెత మారుతి(35) అనే రైతు అప్పుల బాధ తాళలేక గత నెల 28న ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ


బారులుదీరిన భక్తులు

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకం, అర్చన, పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో బారులుదీరారు. అక్షరాభ్యాస మండపాలు చిన్నారులతో కిటకిటలాడాయి. కాగా ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తాలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. – బాసర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు


అమ్మవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

రిమ్స్ నుంచి రిమాండ్ ఖైదీ పరారీ

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ మంగళవారం అర్ధరాత్రి తర్వాత పరారయ్యాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్‌కు చెందిన ఖైదీ ఇటీవల పోక్సో రేప్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. నిర్మల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అనారోగ్యం బారిన పడడంతో జైలు అధికారులు డిసెంబర్ 27న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. ఎస్కార్ట్ ఉన్నప్పటికీ వారి కళ్లు కప్పి ఖైదీ పరారైనట్లు నిర్మల్ ఏఆర్ ఏఎస్సై ఉయిక లల్లు పేర్కొన్నాడు. ఆయన మావల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

నిర్మల్ క్లబ్‌పై పోలీసుల దాడి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నిర్మల్ క్లబ్‌పై మంగళవారం అర్ధరాత్రి పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. ముందస్తు అనుమతులు లేకుండా రాత్రి 11 గంటల ప్రాంతంలో నిర్వాహకులు డిసెంబర్ 31 వేడుకలు జరిపారు. యువతులను రప్పించి ఆటపాటలు నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు క్లబ్‌పై దాడి చేశారు. చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగేలా భారీ శబ్దాలతో డీజే నిర్వహించడంతో పాటు అనుమతి లేకుండా ఆర్కెస్ట్రా నిర్వహించినందుకు నిర్మల్ క్లబ్ నిర్వాహకులు ఎర్రవోతు రాజేందర్, ఇతరులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

అంతర్జాతీయ కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


శ్రీవేద

ఆదిలాబాద్‌టౌన్ (జైనథ్): కేరళకు చెందిన అంతర్జాతీయ పిల్లల మాసపత్రిక గడుగ్గాయి సంక్రాంతి సందర్భంగా కథల పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించింది. జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గాజంగుల శ్రీవేద రాసిన 'ఒకరికొకరు' అనే కథ రెండో బహుమతికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ బుధవారం తెలిపారు. విద్యార్థినికి ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరో విద్యార్థి రాంచరణ్ రాసిన 'తెలివైన కోడి' కథకు ప్రత్యేక బహుమతి లభించిందన్నారు.

ఘనంగా భీమా కోరెగావ్ విజయోత్సవం

ఇంద్రవెల్లి: మండలంలోని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ, భీం ఆర్మీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో భీమా కోరెగావ్ విజయోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహంతో పాటు 1818 జనవరి 1న జరిగిన పెష్వా యుద్ధంలో వీరమరణం పొందిన మహార్ వీర సైనికుల స్మారకంగా ఏర్పాటు చేసిన స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల బౌద్ధ ఉపాసకుల ఆధ్వర్యంలో పంచశీల్, త్రిశరణ్, బుద్ధవందన, ధమ్మవందన, సంఘవందన తీసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, మాజీ ఎంపీపీ కనక తుకారం, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మరే, ఉపాధ్యక్షుడు శివాజీ పవార్, ఆయా పార్టీలు, ఆయా సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, దిలీప్ మోరే, రాథోడ్ అనిల్, ఎండీ మసుద్, ఉత్తం, లహుదాస్, మస్కే రాజువర్ధన్ తదితరులు ఉన్నారు.


ప్రార్థన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నేడు జంగుబాయి క్షేత్రంలో దీపోత్సవం


పూజలు చేసే జెండాలు


జంగుబాయి గుహ ఎదుట ఉండే మైసమ్మ

కెరమెరి: జంగుబాయి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆదివాసీలు భక్తిశ్రద్ధలతో దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఎనిమిది గోత్రాల కటోడాలు, ఆదివాసీలు ఆలయ సన్నిధిలో కొలువుదీరిన దేవతా విగ్రహాలను టొప్లకస నుంచి తీసుకవచ్చిన గంగాజలంతో శుద్ధి చేస్తారు. అనంతరం రావుడ్, పోచమ్మ ఆలయంలోని ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశాక అమ్మవారి గుహకు చేరి దీపం వెలిగిస్తారు. కమిటీ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

మందు బాబులపై పోలీసుల కొరడా

ఆదిలాబాద్‌టౌన్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వారిపై మంగళవారం రాత్రి పోలీసులు కొరఢా ఝుళిపించారు. ఆదిలాబాద్ పోలీసు డివిజన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరిమితికి మించి శబ్దంతో వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

భీమారంలో..

భీమారం: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. మంచిర్యాల– చెన్నూరు జాతీయరహదారిపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

10 మందిపై కేసు..

లక్ష్మణచాంద: మండలంలో 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి ఎస్సై సుమలత ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన మొత్తం 10 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు.

మహాత్మునికి అవమానం


గాంధీ విగ్రహం నోట్లో సిగరెట్ పెట్టిన యువకులు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

- మద్యం మత్తులో యువకుల దుశ్చర్య
- కేసు నమోదు.. పలువురి అరెస్ట్

నిర్మల్‌రూరల్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31 అర్ధరాత్రి వేళ.. కొందరు యువకులు తప్పతాగి గాంధీ విగ్రహాన్ని అవమానించారు. ఈ ఘటన నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేటలో జరిగింది. స్థానికులు, రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నీలాయిపేట గ్రామంలో పలువురు యువకులు వేడుకలు నిర్వహించారు. డీజే, ఆటపాటలతో సంబరాలను నిర్వహించారు. పక్క గ్రామమైన అనంతపేటకు చెందిన పలువురు యువకులు అదే సమయంలో తప్పతాగి పక్కనే ఉన్న జాతీయ రహదారిపైకి వెళ్తూ నీలాయిపేటలో కాసేపు ఆగారు. అక్కడ ఉన్న యువకులతో వాగ్వివాదం పెట్టుకున్నారు. అంతటితో ఆగకుండా బస్టాండ్‌లో ఉన్న గాంధీ విగ్రహాన్ని అవమానం కలిగించారు. విగ్రహం నోట్లో సిగరెట్ పెట్టి, బీడీ కట్ట విగ్రహం పక్కన ఉంచారు. విగ్రహం పక్కన ఉన్న జెండాలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో పరారయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏఎస్పీ రాజేశ్‌మీనా, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి బుధవారం గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మహాత్ముడిని అవమానించిన అనంతపేటకు చెందిన 9 మంది యువకులను గుర్తించారు. 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ప్రమాదం.. తీరని శోకం


మంద రాజు (ఫైల్)


పవన్‌కల్యాణ్ (ఫైల్)

దండేపల్లి: బైక్ ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మణం చెందడం.. రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. దండేపల్లి మండల కేంద్రం సమీపంలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు బైక్ కాలువలో పడ్డ ఘటనలో దండేపల్లికి చెందిన మంద రాజు(35), జిల్లపెల్లి పవన్‌కల్యాణ్(23) మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా వారి మృతితో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

అమ్మ, నాన్నలేని అనాథగా..

మందరాజు మృతి చెందడంతో ఐదో తరగతి చదువుతున్న అతని కూతురు హర్షిత అమ్మా, నాన్నలేని అనాథగా మారింది. రెండేళ్ల క్రితం రాజు భార్య కమల అనారోగ్యంతో మృతి చెందింది. ఇప్పుడు రాజు సైతం మృతిచెందాడు. దీంతో ఆయన కూతురు హర్షిత రోదనలు మిన్నంటాయి. రాజుకు తల్లి బాలమ్మ ఉంది. ఇతనిది నిరుపేద కుటుంబం కావడంతో కాలనీవాసులే అంత్యక్రియలు నిర్వహించారు.

నెల క్రితమే వివాహం..

జిల్లపెల్లి చంద్రమౌళి –సువర్ణ దంపతులకు పవన్‌కల్యాణ్‌తో పాటు కూతురు ఉంది. కూతురుకు వివాహం చేశారు. పవన్‌కల్యాణ్‌కు నెల క్రితమే వివాహం జరిగింది. కుటుంబానికి అండగా నిలిచే కుమారుడు బైక్‌ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ (34) అనే యువకుడు బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


తోట గంగాధర్ (ఫైల్)

వాంకిడి: చికెన్ కొనేందుకు మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన తోట గంగాధర్(29) కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని ఖమాన గ్రామంలో గల తేలివాడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించేవాడు. ఈక్రమంలో ఖమానా గ్రామంలోనే ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. కాగా 6 నెలల క్రితం గంగాధర్‌కు ప్రమోషన్ రావడంతో నవేగూడ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా బదిలీ అయ్యాడు. ఖమాన గ్రామంలోనే ఉంటూ విధులకు హాజరయ్యేవాడు. బుధవారం సాయంత్రం చికెన్ కొనేందుకు వాంకిడి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఖమాన గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వాంకిడి వైపు వెళ్తున్న కొందరు వ్యక్తులు ద్విచక్రవాహనం పడి ఉండటాన్ని గమనించారు. గంగాధర్ తలకు తీవ్రమైన గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే ఆయనను అంబులెన్స్‌లో వాంకిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసిఫాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఎస్సై ప్రశాంత్‌ను సంప్రదించగా రోడ్డు ప్రమాదంపై ఇంకా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.